క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



నందిగామ టౌన్: వసతి గృహాలలోని విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించటంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలోని గదులు, వంటశాల, డైనింగ్ రూము తదితరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వసతి గృహంలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. వసతులు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



కొణకంచి(పెనుగంచిప్రోలు): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను నేరుగా సదస్సు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, మండల సర్వేయర్ స్వప్న, ఆర్ఐ షేక్ అబ్దుల్ హలీమ్, గ్రూపు ఆలయాల ఈఓ బొగ్గవరపు రవీంద్రబాబు, మాజీ సర్పంచ్ కాసాని శ్రీనివాసరావు, నాయకులు కాకుమాను అశోక్, రైతులు పాల్గొన్నారు.

నందిగామ డీసీ-2 చైర్మన్‌గా రాటకొండ



నందిగామ టౌన్: నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-2 చైర్మన్‌గా రాటకొండ చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. మండలంలోని తొమ్మిది మంది నీటి సంఘాల అధ్యక్షులు చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు ఎన్నికల అధికారులు నియామక పత్రాన్ని అందజేశారు. రాటకొండ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన రాటకొండను పలువురు నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం

నందిగామ టౌన్: దీర్ఘకాలంగా వేధిస్తున్న రెవెన్యూ పరమైన సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని మాగల్లు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ భూములకు సంబంధించిన రెవెన్యూపరమైన సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకాలు, భూముల సర్వే, అడంగల్ తదితరాలలోని తప్పొప్పులను సరిచేయటం తదితర సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతుల నుంచి నాలుగు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో వీఆర్వో గోపి, గ్రామ నాయకులు అప్పారావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విలియంపేటలో పరిశుద్ధ హెర్మోను రూపాంతర సీఎస్ఐ చర్చిలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జగ్గయ్యపేట సౌత్ డీనరీ చైర్మన్ దర్శన్ సుందర్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవసందేశం ఇచ్చారు. ముందుగా పాస్టర్లు, సంఘ పెద్దలతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేశారు. క్రిస్టియన్‌పేట డీసీ ఆనందరావు, పాస్టర్లు అభిలాష్, జోసఫ్, సంఘ పెద్దలు మల్లెల కొండయ్య, కోట అన్నారావు, మల్లెల నరేష్ పాల్గొన్నారు.



చిట్టేల-కన్నెవీడు రహదారిపై తిరుగుతున్న కోతులు

బెంబేలెత్తిస్తున్న వానర మూకలు

- పాఠశాలకు, ట్యూషన్లకు వెళ్లాలంటేనే భయపడుతున్న విద్యార్థులు
- పంటలపై గుంపులుగుంపులుగా దాడి
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- తక్షణం కోతులను అరికట్టాలని ప్రజలు వేడుకోలు

వత్సవాయి: మండలంలోని పలు గ్రామాల్లో వానరాల ఆగడాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో దారిన పోయే వారిని దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై నడవాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా చిట్టేల, వత్సవాయి, మక్కపేట, గోపినేనిపాలెం, మంగొల్లు, భీమవరం గ్రామాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల వత్సవాయి, చిట్టేల, మక్కపేట గ్రామాల్లో దాదాపు 20 మంది వరకు వీటి బారినపడి గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారి వెంటపడుతుండడంతో వారు అదుపు తప్పి కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. గ్రామాల్లో కోతులను నిర్మూలించడం ప్రజాప్రతినిధులకు సవాల్‌గా మారింది. పలు గ్రామాల్లోని వార్డు సభ్యులు పలు దఫాలు పంచాయతీ సమావేశాల్లో కోతులను అరికట్టాలని తీర్మానాలు చేసినా ప్రయోజనం ఉండడంలేదని వాపోతున్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే భయపడుతున్న విద్యార్థులు

ప్రధానంగా విద్యార్థులు కోతుల కారణంగా పాఠశాలలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రాత్రి సమయాలలో ట్యూషన్ల నుంచి ఇంటికి తిరిగి వస్తున్న చిన్నారులపై మాటున ఉండి దాడికి దిగుతున్నాయి. పాఠశాలకు, ట్యూషన్లకు వెళ్లిన పిల్లలు ఇంటికి క్షేమంగా వచ్చేదాకా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో అరుగులపై కూర్చుంటున్న వృద్ధులు, ఆడుకుంటున్న చిన్నారులను సైతం వానరాలు వదలడం లేదు. అకస్మాత్తుగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు నెలల క్రితం వేరే ప్రాంతం నుంచి లారీలో కోతులను తీసుకువచ్చి చిట్టేల, వత్సవాయి, మక్కపేట పరిసర ప్రాంతాలలో వదిలివెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

మనుషులే కాదు...పంటలపై సైతం...

కోతుల దెబ్బకు పత్తి, మొక్కజొన్న, కూరగాయ పంటల రైతులు విలవిలలాడుతున్నారు. వందల సంఖ్యలో ఉన్న కోతులు గుంపులు గుంపులుగా దాడి చేసి పత్తిపంటను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పత్తికాయలు, మొక్కజొన్న కంకులు వంటివి తినడంతో పాటు చెట్లను విసిరి వేస్తున్నాయి. రైతులు నలుగురైదుగురు కలిసి కోతులను అదిలించడమే పనిగా పెట్టుకోవలసివస్తోంది. గ్రామాల్లో జరిగే సభలు, సమావేశాల్లో పలుమార్లు కోతుల సమస్యను విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కోతులను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోతులతో నానా ఇబ్బందులు



కోతుల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. పగలు సమయాలలో వ్యవసాయ పనులకు వెళ్లడం వల్ల ఇళ్ల వద్ద ఎవరం ఉండడం లేదు. దీంతో వాటి ఇష్టం వచ్చినట్లు చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే పిల్లలతో పాటు వీధులలో ఆడుకుంటున్న చిన్నారులు కూడా వీటి బారిన పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి లారీల ద్వారా కోతులను తీసుకువచ్చి రాత్రి సమయాలలో మా ప్రాంతాలలో వదిలివెళ్తున్నారు.

– సయ్యద్ జాన్‌బాషా, చిట్టేల

రవాణా రంగంలో ఆటో కార్మికులది కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చవాన్

కంచికచర్ల: రవాణా రంగంలో ఆటో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చటంలో మంచి సేవలందిస్తున్నారని నందిగామ రూరల్ సీఐ డి.చవాన్ అన్నారు. స్థానిక ఏపీఎన్జీఓస్ సంఘ కార్యాలయంలో మండలంలోని ఆటో వర్కర్ల సమావేశం సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల డ్రైవర్లు దురుసుగా ప్రవర్తించరాదన్నారు. మద్యం తాగి ఆటోలు నడపరాదన్నారు. ఆటోలను రాంగ్‌రూట్‌లో నడపకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఆటో వాలాలు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు.ఆటో డ్రైవర్లను రోడ్డుపై చిన్న చిన్న కారణలతో ఇబ్బందిపెట్టటం పోలీసుల ఉద్దేశం కాదని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలు నిలపాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. చలానాల పేరుతో ఆటో డ్రైవర్లను ఇబ్బంది పెట్టటం సరికాదన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల విజయవాడ నగరంలో వరదల కారణంగా దాదాపు నెల రోజులపాటు ఉపాధి కోల్పోయిన ఆటోవాలాలు ఆటో ఫైనాన్స్ చెల్లించకపోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఆటో కార్మికులంతా సంఘటితంగా ఉండి సమస్యలు ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల రాష్ట్ర నాయకుడు కె.దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని ప్రతి ఒక్క ఆటో కార్మికుడు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నూతన చట్టాల పేరుతో ఆటో కార్మికుల హక్కులను కాలరాస్తూ వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కార్మికులు నిలదీయాలని అన్నారు. అనంతరం ఆటో కార్మికులు సీఐ చవాన్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం, గౌస్, శివకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, వత్సవాయి డీసీ కమిటీలు ఏకగ్రీవం



జగ్గయ్యపేట డీసీ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన గోపాలరావుకు నియామకపత్రం అందజేస్తున్న ఈఈ

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎన్ఎస్పీ ఓ అండ్ ఎం కార్యాలయంలో మంగళవారం డీసీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జగ్గయ్యపేట (01) డీసీ కమిటీ అధ్యక్షునిగా ముండ్లపాడు నీటి సంఘం అధ్యక్షుడు ఏలూరు గోపాలరావు, ఉపాధ్యక్షునిగా వత్సవాయి మండలం మంగొల్లు (4) అధ్యక్షుడు మన్నే నారాయణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారికి ఈఈ సంతోష్ రాథోడ్ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈ రాంబాబు, ఏఈఈ గోపాల్, నాయకులు కట్టా నరసింహారావు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో డీసీ-4 వత్సవాయి డీసీ కమిటీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా వేములనర్వకు చెందిన చిట్టూరి సుభాష్, జొన్నలగడ్డకు చెందిన చింతోటి సాంబశివరావులను ఎన్నుకున్నారు.

ఏకగ్రీవంగా జుజ్జూరు డీసీ కమిటీ ఎన్నిక



వీరులపాడు: మూడపాడు మేజర్ పరిధిలోని మండలంలోని జుజ్జూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీసీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ముందుగా మండలంలోని ఏడు మేజర్ ఇరిగేషన్ కెనాల్ అధ్యక్షులతో ఎన్నికల అధికారి శైలజ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. డీసీ కమిటీ ఎన్నికకు గ్రామానికి చెందిన కాపా రాంబాబు నామినేషన్ ఒక్కటే రావటంతో నీటి సంఘాల అధ్యక్షులు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కోట రామారావును ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఎన్నికైన డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ ఏఈ నరేష్‌బాబు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం



పోస్టాఫీసు వద్ద ఉన్న పెన్షనర్స్ భవన్‌లో విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు



ధరణకోట పెన్షనర్స్ భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ధరణికోట వారి పెన్షనర్స్ కార్యాలయం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సేవలు ఆదర్శనీయం అని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక ఎన్ఎస్పీ గ్యారేజీలో సంఘం సమావేశం సంఘ అధ్యక్షుడు దారా వినోద్‌బాబు అధ్యక్షతన జరిగింది. జనసేన యువనేత సామినేని వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవలను కొనియాడారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించి సంఘ సభ్యులందరికీ ఉచితంగా అందజేశారు. 70 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగ సభ్యులందరినీ ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు ధరణికోట వెంకటరమణ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఉప ఖజానా అధికారి ఎస్.ప్రఫుల్లకుమార్ అన్నారు. పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న దివంగత వారణాసి జగదీశ్వరప్రసాద్, జాగర్లమూడి రాధాకృష్ణ స్మారక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ సౌకర్యం కోసం 1982 డిసెంబర్ 17 న జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుతో పెన్షనర్లకు భద్రత కలిగిందన్నారు. అనంతరం సీనియర్ సంఘ సభ్యులను సన్మానించారు. సంఘ అధ్యక్షుడు మాదిరాజు కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య శెట్టి, గుత్తా దుర్గాప్రసాద్, వెంకటరెడ్డి, చెరుకూరి గ్రూప్ మేనేజర్ రమేష్, బాలుర హైస్కూల్ హెచ్ఎం మాధవీలత, పెన్షనర్ల సంఘ కార్యదర్శి అబ్బాస్ ఆలీ, కోశాధికారి జి.శంకరరావు, ఉపాధ్యక్షులు ప్రేమ్‌చంద్, ఎస్.రంగారావు, పార్థసారథి, ఖాసిం సైదా, ఆంజనేయులు,షమీఉల్లా, రామారావు పాల్గొన్నారు.

కంచికచర్ల మండల డీసీ అధ్యక్షుడిగా కాళేశ్వరరావు

కంచికచర్ల: సాగునీటి సంఘ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు కంచికచర్ల ఎన్ఎస్పీ కార్యాలయంలో మంగళవారం జరిగాయి. మండలంలో 7 సాగునీటి సంఘాలున్నాయి. డీసీ నంబర్ 15కు అధ్యక్షుడుగా గోపినేని కాళేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నన్నపనేని లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ డీఈఈ కె.శ్రీవాత్సవ, ఏఈ శివనాగిరెడ్డి అసిస్టెంట్ ఎన్నికల అధికారి నాగరాజు నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ వహీద్ రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 22 దరఖాస్తులు

బూదవాడ(జగ్గయ్యపేట): రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించే దరఖాస్తులకు తక్షణ పరిష్కారం లభిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ తెలిపారు. గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ, అటవీ తదితర భూముల సమస్యలను సర్వే అధికారులు పరిశీలించి పరిష్కరిస్తున్నారన్నారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 22 దరఖాస్తులను అందించారని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బాబూరావు, మండల సర్వేయర్ అనూష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సత్కారం



కంచికచర్లలో పెన్షనర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ జాహ్నవి, రామ్మోహనరావు తదితరులు

కంచికచర్ల: కంచికచర్ల పెన్షనర్ల సేవా భవన్‌లో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని సంఘ అధ్యక్షుడు సాని రామ్మోహనరావు అధ్యక్ష్యతన నిర్వహించారు. ముందుగా డీఎస్ నకారా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్లు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి కారణం డీఎస్ నకారా కృషి అని అన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు ఎంవీఎస్ బాలరాజు, ఎ.నరసింహారావు, ఆర్.జనార్ధనరావు, ఎండీ మొయినుద్దీన్, షేక్ మస్తాన్, ఏసుపాదంలతో పాటు మరికొంతమందిని సంఘ నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలాజీనాయక్, ఎస్‌బీఐ మేనేజర్ జి.గోపీకృష్ణ, సంస్కృతి విద్యామందిర్ కరస్పాండెంట్ పి.రమేష్, సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ట్రెజరర్ నాగేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, టి.లక్ష్మణరావు, కె.సుబ్బారావు, బొజ్జా మల్లికార్జునరావు, బీవీ సర్వేశ్వరరావు, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో...

స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లును సత్కరించినట్లు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో జల్లి కారల్‌మార్క్స్, కుక్కమూడి బాబూరావు, బాలస్వామి, పేరయ్య, శ్రీనివాసరావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలు గుర్తించాలి



మాట్లాడుతున్న విస్తరణ అధికారి పద్మావతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల విస్తరణాధికారి పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల శిక్షణ తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో పాటు సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాభివృద్ధి జరగాలంటే పన్నుల వసూళ్లను వేగవంతం చేయటంతో పాటు సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు, తదితరాలను పరిష్కరించటం వల్ల గ్రామాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చిట్టిబాబు, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, శిక్షకులు లింగయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేయాలి

ఎంపీపీ మలక్‌బషీర్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: గ్రామాల్లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై గ్రామ సచివాలయం ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన దిశగా ఉద్యోగులు పనిచేయాలని అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సకాలంలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెటర్నరీ సిబ్బంది, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగ్గయ్యపేట అర్బన్: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ధ్యానమహర్షి సంత్ సదానందగిరి మహరాజ్ అన్నారు. గౌతమ బుద్ధ పిరమిడ్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం స్థానిక బుద్ధ విహార్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన గౌతమ బుద్ధ ధ్యానకేంద్రంలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంత్ సదానందగిరి మహరాజ్ మాట్లాడుతూ నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడితో ఉన్నవారికి ధ్యానం ద్వారా ఉపశమనం లభిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జగ్గయ్యపేటతో పాటు నందిగామ పరిసర ప్రాంతాల్లో కూడా పిరమిడ్ రూపంలో ఉన్న ధ్యాన కేంద్రాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. మనిషికి నిజమైన ఆనందం లభించేది కేవలం బుద్ధుని ఆలోచనల్లోనే అన్నారు. చెడును దూరం పెట్టండి, మంచిని పెంచండి, మనసును శుద్ధి చేసుకోండి అనే బుద్ధుని సూక్తులు నేటి తరానికి అత్యంతావశ్యకం అని అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు బద్దూనాయక్, రాష్ట్ర మైనార్టీసెల్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్, న్యాయవాది సత్యశ్రీనివాస్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, ధ్యానకేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంతో గ్రామాభివృద్ధి

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించటం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీసీ చైర్మన్, వైస్ చైర్మన్లు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట ఎన్ఎస్పీ పరిధిలో గల డీసీ-1 కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన ఏలూరి గోపాలరావు, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మన్నె నారాయణరావు, డీసీ-4 దాములూరు కెనాల్ చైర్మన్‌గా ఎన్నికైన చిట్టూరి సుభాష్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన చింతోటి సాంబశివరావు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రైల్వే ట్రాక్ భూముల పరిశీలన

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని రైల్వే ట్రాక్ భూములను నందిగామ ఆర్డీవో బాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం గ్రామంలో రైల్వే ట్రాక్ ఏర్పాటుకు కొందరు రైతులు 7.53 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అందించలేదని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబూరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఆర్ఐ సూరమ్మ, సర్వేయర్ అనూష్‌బాబు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ